
సాక్షి
నాగర్‌కర్నూల్
గురువారం ♦ 3 ♦ ఆగస్టు ♦ 2023



జూరాలలో 10 గేట్ల ఎత్తివేత
జూరాలకు వరద పెరగడంతో బుధవారం 10 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు.
వివరాలు 8లో ▸



శక్తిపీఠంపై నిర్లక్ష్యం
అలంపూర్ ఆలయాల నుంచి ఆదాయం వస్తున్నా.. దేవాదాయశాఖ పట్టించుకోవడం లేదు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.5 /23.1
వాతావరణం
రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సింగోటం ఆలయ హుండీ ఆదాయం రూ.10లక్షలు



కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో వెలసిన లక్ష్మి నరసింహస్వామి ఆలయ హుండీని బుధవారం ఆలయ చైర్మన్ ఆదిత్య లక్ష్మణ్ రావు, ఈఓ రంగారావు ఆధ్వర్యంలో లెక్కించారు. ఐదు నెలలకు సంబంధించి హుండీ ఆదాయం లెక్కించగా రూ.10.49 లక్షలు, ఒక కిలో 420 గ్రాముల మిశ్రమ వెండి రావడం జరిగిందని ఈఓ రంగారావు తెలిపారు.

నేటి నుంచి 'సదరం' స్లాట్ బుకింగ్

కందనూలు: జిల్లాలోని దివ్యాంగులు నూతన, రెన్యూవల్ సదరం సర్టిఫికెట్లు పొందుటకు గురువారం నుంచి స్లాట్ బుకింగ్ ప్రారంభమవుతుందని డీఆర్‌డీఓ నర్సింగరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినికిడి లోపం ఉన్న వాళ్లకు 7వ తేదీన, శారీరక వికలత్వానికి సంబంధించి 8, 17, 24, 29 తేదీల్లో, కంటి చూపు లోపం ఉన్నవారికి 24, మానసిక లోపం ఉన్న వారికి 7, 21వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో సదరం క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాగులు మీసేవలో రూ.35 రుసుం చెల్లించి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని, క్యాంపునకు వచ్చే వారు ఆధార్, ఆస్పత్రి పేపర్లు, మూడు పాస్‌ఫోటో సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

నేటి నుంచి నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో బుధవారం (నేటి) నుంచి నులిపురుగు నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు, సమష్టి కృషితో దీనిని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధాకర్‌లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో కలెక్టర్ ఉదయ్‌కుమార్ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఒకవేళ ఈ రోజు మాత్రలు వేసుకోని వారికి మరోమారు ఈనెల 10న పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 2,07,836 మంది ఏడాది వయస్సు నుంచి 19 ఏళ్ల వారు ఉన్నారని, అందరూ తప్పక అల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు.

అంబేద్కర్ ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలు

కల్వకుర్తి టౌన్: డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లుగా కల్వకుర్తి స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ మల్లేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా డిగ్రీలో 2, 3వ సంవత్సరాలు చదివే విద్యార్థులు వారి అడ్మిషన్ ఫీజును చెల్లించాలని, 2015 నాటి నుండి నేటివరకు పాతబ్యాచ్ విద్యార్థులు సైతం ఆన్‌లైన్‌లో అడ్మిషన్ ఫీజు చెల్లించాలని సూచించారు. ఈ నెల 16వ తేదీ ప్రవేశాలకు, అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు తుది గడువని, మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ లేదా కల్వకుర్తి స్టడీ సెంటర్ ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో గానీ, హెల్ప్‌లైన్ సెల్ నం. 7382929720 లో సంప్రదించవచ్చని తెలిపారు.

తొలిమెట్టు ద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్య



లింగాల: విద్యార్థులందరికీ ఆయా సబ్జెక్టులలో నిర్దేశించిన సామర్థ్యాలు, అభ్యాసన ఫలితాలు సాధించే విధంగా తొలిమెట్టు ద్వారా గుణాత్మక విద్య అందించాలని, ఉపాధ్యాయులు శిక్షణలో అవగాహన పొందిన అంశాలను తరగతి గదిలో అమలు పర్చాలని కోర్సు డైరెక్టర్ శేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో ఎఫ్ఎల్ఎస్ తొలిమెట్టు ఉపాధ్యాయ శిక్షణలో భాగంగా తెలుగు పాఠ్యాంశానికి సంబంధించి రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణను బుధవారం ఆయన ప్రారంభించారు. లెసన్ ప్లాన్ ఆధారంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన ఉండాలని సూచించారు. ఆర్పీలు శివప్రసాద్, నరేష్, కుర్మయ్య శిక్షణాల తరగతులను నిర్వహిస్తూ పలు అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

రైతుకు తీపికబురు



పొలం దున్నుతున్న రైతు



నేటి నుంచి రుణమాఫీ
- విడతల వారీగా పంట రుణం మాఫీ చేయనున్న ప్రభుత్వం
- జిల్లావ్యాప్తంగా 1.56 లక్షల మంది రైతులకు లబ్ధి

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. గురువారం నుంచే రైతుల పంటరుణాల మాఫీ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించింది. ఈ నెల 3వ తేదీ నుంచి సెప్టెంబర్ రెండో వారంలోగా విడతలవారీగా రుణమాఫీ ప్రక్రియను పూర్తిచేయాలని నిర్దేశించింది. ప్రభుత్వ ప్రకటనతో జిల్లాలోని రైతుల్లో ఆశలు నెలకొన్నాయి. ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల ఆశ నెరవేరుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రూ.50 వేల లోపు పంటరుణం తీసుకున్న రైతుల పంటరుణాలను మాత్రమే ఇప్పటివరకు ప్రభుత్వం మాఫీ చేసింది. దీంతో 18,796 మందికి మాత్రమే రుణం మాఫీ అయ్యింది. తాజాగా ప్రభుత్వ ప్రకటనతో జిల్లావ్యాప్తంగా రూ.లక్ష లోపు రుణం ఉన్న 1,56,662 మంది రైతులకు లబ్ధిచేకూరనుంది.

ఊరట..

వ్యవసాయంలో సాగుఖర్చుల కోసం రూ. లక్షలోపు పంట రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేస్తామని గత ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. అయితే మొదటి విడత కింద రూ. 50 వేలలోపు రుణం ఉన్న రైతులకు మాత్రమే మాఫీ చేయడంతో మిగిలిన రైతులు నిరాశ చెందారు. మళ్లీ రుణమాఫీ ప్రక్రియ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతులకు ప్రభుత్వ తాజా ప్రకటనతో ఊరట లభించింది.

విడతల వారీగా అమలు



జిల్లాలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విడతలవారీగా రైతులకు రుణమాఫీ ప్రక్రియ మొదలు అవుతుంది. ఇంకా పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు రావాల్సి ఉంది. – వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి, నాగర్‌కర్నూల్)

రూ.లక్ష రుణం తీసుకున్నా..



ఎస్‌బీఐ బ్యాంకులో రూ. లక్ష పంటరుణం తీసుకున్నా. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ఎప్పుడు రుణమాఫీ చేస్తుందోనని ఎదురుచూస్తున్నా. గతంలో కొంతమందికి మాఫీ అయినా మాకు మాత్రం కాలేదు. ఇటీవల బ్యాంకులో పంటరుణాన్ని రెన్యూవల్ చేసుకున్నా. ప్రభుత్వం త్వరగా రుణమాఫీ ప్రక్రియ పూర్తిచేయాలి.
– మాదుగాని సుధాకర్, రైతు, రాయిపాకుల, తెలకపల్లి మండలం

ఎన్నికల ముందే పూర్తిచేయాలి



ప్రభుత్వం గత ఎన్నికల సమయంలోనే రైతుల రుణం మాఫీ చేస్తామని చెప్పినా ఇప్పటివరకు చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఈసారి ఎన్నికలకు ముందే సకాలంలో రుణమాఫీ పూర్తిచేయాలి. – సంద మల్లయ్య, రైతు, తాడూరు

ఏళ్లుగా ఎదురుచూశాం



రాష్ట్ర ప్రభుత్వం లక్ష లోపు రుణమాఫీ చేస్తే సంతోషిస్తాం. 2018లో స్థానిక ఏపీజీవీబీలో బ్యాంకులో రూ. 90 వేలు పంట రుణం తీసుకున్నాను. అప్పటి నుంచి రెగ్యులర్‌గా ప్రతి ఏటా వడ్డీ చెల్లిస్తూ రెన్యూవల్ చేసుకుంటున్నాను. రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నాం. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించినట్లుగా బ్యాంకులో ఉన్న పంట రుణం మాఫీ చేస్తే కొత్త రుణం తీసుకోవడానికి అవకాశం ఉంటుంది.
– వావిలాల అచ్యుతారెడ్డి, రైతు, ఉప్పునుంతల

జిల్లా వివరాలిలా..	పంటరుణం తీసుకున్న రైతులు	ఇప్పటివరకు లబ్ధి పొందినవారు	ఇప్పటివరకు మాఫీ అయిన మొత్తం	ఇంకా మిగిలినవారు	ఇంకా మాఫీ కావాల్సింది రూ.
	1,75,458 మంది	18,796 మంది	రూ. 33.61 కోట్లు	1,56,662 మంది	720.84 కోట్లు

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించండి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

కందనూలు: జిల్లాలో క్లిష్టమైన, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లను గుర్తించాలని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్, రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ మనోహర్, అదనపు కలెక్టర్లు,ఆర్డీవోలు, పోలీస్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత అసెంబ్లీ, పార్లమెంట్, లోకల్ బాడీ ఎన్నికల్లో ఏదైన పోలింగ్ కేంద్రంలో గొడవలు, లేదా కుల మతపరమైన ఘర్షణలు, ఓటు వేయడానికి ప్రభావం చూపే సంఘటనలు, ప్రజలు భయంతో ఓటు వేయడానికి ముందుకు రాని పరిస్థితులు ఏమైనా ఉన్నాయా..ఉంటే పూర్తి సమాచారంతో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలు ఏవి లేవని ఒక నిర్ధారణకు రాగా, క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలు కొన్ని ఉన్నాయని పోలీస్ అధికారులు, కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ అలాంటి క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలు జిల్లాలో ఎన్ని ఉన్నాయి, ఎక్కడెక్కడ ఉన్నాయో నివేదిక రూపంలో ఇవ్వాల్సిందిగా సూచించారు. పోలీస్ అధికారులు, ఆర్డీవోలు సమన్వయంతో జాబితా సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్‌బడి) కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీతారామరావు తదితరులు పాల్గొన్నారు.

5లోగా నూతన ఆవిష్కరణల నమోదు

ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో భాగంగా నూతన ఆవిష్కరణలు నమోదు చేసుకోడానికి ఈనెల 5వ తేది వరకు అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ ఉదయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దైనందిన జీవితంలో మనం ఎదుర్కొనే సమస్యలను నూతన చిట్కాలతో సులువుగా చేయగలిగే ప్రతీది ఆవిష్కరణగా భావించడం జరుగుతుందని, అలాంటి నూతన ఆవిష్కరణలు వ్యవసాయ రంగంలో, గ్రామస్థాయిలో అనేకం జరుగుతుంటాయి.. వాటిని ఇంటింటా ఇన్నోవేటర్ అనే కార్యక్రమానికి 9100678543 అనే వాట్సప్ నెంబరు పంపించాలని సూచించారు. ప్రతి గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి నూతన ఆవిష్కరణలపై చర్చించడం, ఆవిష్కరణ, ప్రదర్శించడం, ఇతర మార్గాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడతాం



మాట్లాడుతున్న శివాజీ

అచ్చంపేట రూరల్: మహారాష్ట్రలో రైతు రాజ్యం కావాలని అంటున్న సీఎం కేసీఆర్ తెలంగాణలో ఎంతవరకు సాధ్యమైందని చెప్పాలని, మహారాష్ట్రలో సీఎం కేసీఆర్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రచారం చేస్తామని శివసేన రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ అన్నారు. బుధవారం అచ్చంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతుల వద్ద బలవంతంగా భూములు లాక్కున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని, ప్రస్తుత వర్షాలకు రైతుల పంటలు నీటిలో మునిగితే కూడా ఆదుకోని ప్రభుత్వమన్నారు. ఇప్పటి వరకు రైతులకు రుణ మాఫీ చేయలేదని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదన్నారు. పొలం దున్నే కౌలు రైతుకు రైతుబంధు ఇవ్వాలని, ఉచిత ఎరువులు అందించాలన్నారు. రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వానికి అబ్కిబార్ కిసాన్ సర్కార్ ఎలా సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో శివసేన నాయకులు మారుతి, విష్ణు, సాయి, వెంకటేష్, అఖిల్, సిజ్జు, శంకర్ పాల్గొన్నారు.

కొత్త మద్యం పాలసీకి దుకాణాల కేటాయింపు

మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఉమ్మడి జిల్లాకు సంబంధించి మద్యం దుకాణాల కేటాయింపు చేసింది. 2021లో ఏర్పాటు చేసిన దుకాణాలే మరో రెండేళ్ల (2023–25) వరకు కొనసాగనున్నాయి. ఈ ఏడాది నవంబర్ 30తో ఎక్సైజ్ మద్యం పాలసీ ముగియనున్న క్రమంలో డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం దుకాణాలు అమల్లోకి రానున్నాయి. కొత్త మద్యం దుకాణాలకు సంబంధించి కులాల వారీగా దుకాణాలను కేటాయించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 230 మద్యం దుకాణాలు కొనసాగుతున్నాయి.

జిల్లా	గౌడ్‌లు	ఎస్సీ	ఎస్టీ	ఓపెన్	మొత్తం దుకాణాలు
మహబూబ్‌నగర్, పేట	14	10	3	63	90
నాగర్‌కర్నూల్	9	9	4	45	67
గద్వాల	5	6	0	25	36
వనపర్తి	4	5	1	27	37



2021లో నిర్వహించిన టెండర్లకు వచ్చిన దరఖాస్తులు

జిల్లా	మద్యం దుకాణాలు	వచ్చిన టెండర్లు
మహబూబ్‌నగర్, పేట	90	1530
నాగర్‌కర్నూల్	67	1507
గద్వాల	36	987
వనపర్తి	37	694
మొత్తం	230	4718

4న అథ్లెటిక్స్ మీట్

లింగాల: మండల కేంద్రంలో ఈ నెల 4వ తేదీన గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ మీట్‌ను నిర్వహిస్తున్నట్లు ఏటీఎల్ రాధ ఒక ప్రకటనలో తెలిపారు. లింగాల, బల్మూర్, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి మండలాలకు చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల బాలికలు అర్హులని, ఈ మీట్‌లో 100, 200, 400 మీటర్ల పరుగు, షార్ట్ పుట్, లాంగ్ జంప్ పోటీలు ఉంటాయని తెలిపారు.

నిలకడగా ఉల్లి ధర



మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధం చేసిన ఉల్లి బస్తాలు

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి వేలంలో ధరలు నిలకడగా ఉన్నాయి. మార్కెట్‌కు దాదాపు 200 బస్తాల ఉల్లి అమ్మకానికి రావడంతో వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. గత వారం నమోదు అయిన ధరలే అటు ఇటుగా నమోదయ్యాయి. క్వింటాల్ ఉల్లి ధర గరిష్టంగా రూ.1,850 పలకగా, కనిష్టంగా రూ.1,400 వరకు ధరలు నమోదయ్యాయి. చిన్నగా ఉండే ఉల్లి ధర రూ.800 నుంచి రూ.1,100 వరకు పలికింది. మార్కెట్‌లో ప్రస్తుతం సీజన్ లేకపోవడం వల్ల కేవలం ఉల్లి వ్యాపారం మాత్రమే కొనసాగింది. తూకాల అనంతరం వినియోగదారులతో పాటు చిరు వ్యాపారులు ఉల్లిని కొనుగోలు చేశారు. 45 కేజీల బస్తా గరిష్టంగా రూ.900, కనిష్టంగా రూ.700 వరకు అమ్మకాలు సాగించారు. చిన్న ఉల్లి గరిష్టంగా రూ.600, కనిష్టంగా రూ.400 వరకు విక్రయించారు. దేవరకద్ర సంతలో కిలో ఉల్లి రూ.20 వరకు అమ్మారు.

ఎన్‌సీసీ వార్షిక శిక్షణ ప్రారంభం



శిక్షణకు హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో 8వ బెటాలియన్ ఎన్‌సీసీ వార్షిక శిక్షణ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలల్లో చదువుతున్న ఎన్‌సీసీ క్యాడెట్ విద్యార్థులు శిక్షణకు హాజరయ్యారు. క్యాంప్ కమాండర్ ఎస్‌కే సింగ్ మాట్లాడుతూ పది రోజుల పాటు నిర్వహించే డ్రిల్, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్, అబ్‌స్టాకిల్ వంటి వాటిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు దేశభక్తి, నాయకత్వం, జీవననైపుణ్యాలు, జాతీయ సమైక్యత, జాతి నిర్మాణం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు కుల్‌దీప్‌సింగ్, విజయ్‌కుమార్, రాజేశ్వరి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

కల్వకుర్తి రూరల్: కల్వకుర్తి తహసీల్దార్‌గా విధులు నిర్వహించి పదోన్నతిపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా రాంరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీయూడబ్లూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. రాములు, కృష్ణయ్య, మాధవరెడ్డి, సమ్మద్ పాల్గొన్నారు.

అమ్మపాలు.. అమృతం

- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు
- తల్లిపాలతో బిడ్డలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన
- జిల్లాలో వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు





అచ్చంపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

అచ్చంపేట: తల్లిపాలు అమృతంతో సమానం. శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు రోగ నిరోధక శక్తిని పొందాలంటే తల్లిపాలు పట్టించాల్సిందే. తల్లిపాలను పుట్టిన బిడ్డకు పడితే బిడ్డతో పాటు తల్లికి ఎన్నో లాభాలున్నాయి. ఎన్నో రకాల వ్యాధులు రాకుండా ఉంటాయి. ఇంతటి విశిష్టత కలిగిన తల్లిపాలను బిడ్డ ఎంత వయస్సు వచ్చే వరకు ఇవ్వాలి, తల్లిపాలు పుష్కలంగా రావాలంటే ఎంచేయాలి, ముర్రు పాలు ఎప్పుడు పట్టాలి, ఇలాంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ.. తల్లిపాల ప్రాముఖ్యతను చాటేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 1నుంచి 7వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అంగన్‌వాడీ టీచర్, హెల్త్ కార్యకర్తలు.. గర్భిణులకు,బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు.

ముర్రుపాలు తప్పనిసరి ఎందుకంటే...

- బిడ్డ పుట్టిన మొదటి గంటలోపే తల్లులకు వచ్చే పాలను ముర్రుపాలు అంటారు. వీటిని ఖచ్చితంగా శిశువుకు పట్టాలి. ఈపాల వల్ల రోగనిరోధకశక్తి పెరగడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషక పదార్థాలు అందుతాయి. ఇందులో మాంసకృత్తులు, ప్రొటీన్లు, ఏ,సీ,డీ, ఇ, కె. విటమిన్లు, కొవ్వు, చక్కెర పదార్థాలు, మినరల్స్ బిడ్డకు అందుతాయి.
- ముర్రుపాలు బిడ్డకు కావాల్సిన రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి.
- ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు తప్ప ఇతర ఏ ద్రవ పదార్థాలు ఇవ్వరాదు.

బిడ్డకు కలిగే లాభాలు..

- తల్లిపాలతో బిడ్డ మెదడు అభివృద్ధి చెంది ప్రతిభను కూడా పెంచుతుంది.
- ప్రేమ, ఆప్యాయతలతో కూడిన బంధంతో పాటు బిడ్డలో భావపూరిత భద్రతా భావాన్ని పెంపొందింపజేస్తుంది. తల్లి పాలు తాగే శిశువు పెరుగుదలకు, జ్ఞానేంద్రియాలు ఉత్తేరించటానికి ఉపయోగపడతాయి.
- బిడ్డకు కావాల్సిన ఇనుము, కాల్షియం తల్లిపాల ద్వారా రావడం వల్ల బిడ్డకు రక్తహీనత రాదు.
- తల్లిపాలు సులభంగా జీర్ణమవుతాయి. శిశువుకు మలబద్ధకం, కడుపునొప్పి రాదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

బిడ్డకు పాలిచ్చే సమయంలో తల్లి కొన్నింటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. బిడ్డను పడుకోబెట్టి, నిలబెట్టి పాలు పట్టకూడదు. ఇలా ఇవ్వడం చాలా ప్రమాదకరం. పాలిచ్చే సమయంలో కెఫిన్ అధికంగా ఉండే పదార్థాలు, శీతల పానియాలు తీసుకోకపోవడం మంచిది. ఇది బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది.

జిల్లా వివరాలిలా..

మొత్తం ఐసీడీఎస్ ప్రాజెక్టులు : నాగర్‌కర్నూలు, అచ్చంపేట, బల్మూర్, కొల్లాపూర్, కల్వకుర్తి

అంగన్‌వాడీ కేంద్రాలు	1,131
బాలింతలు	13,091
గర్భిణీలు	5,417
చిన్నారులు	52,223

తల్లిపాలు శ్రేష్టమైనవి

తల్లిపాలు శ్రేష్టమైనవి. గర్భిణులు, బాలింతలు తల్లిపాల విశిష్టతను తప్పకుండా తెలుసుకోవాలి. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. వీటిపై అవగాహన కల్పించేందుకు ఏటా ఆగస్టు మొదటి వారంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఇంటింటికి వెళ్లినప్పుడు అంగన్‌వాడీ టీచర్, హెల్త్ కార్యకర్తలు కాన్పుకు దగ్గరలో ఉన్నవారికి తల్లిపాల గురించి తెలియజేస్తారు.
–వెంకటలక్ష్మి జిల్లా సంక్షేమశాఖ అధికారి నాగర్‌కర్నూల్

పాలు పుష్కలంగా రావాలంటే..

గర్భం దాల్చినప్పటి నుంచే గర్భిణులు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. పాలు, చేపలు, గుడ్లు, వెల్లుల్లి, తాజా కూరగాయాలు, పండ్లు, తగిన మోతాదులో తీసుకోవాలి. ఆహారంలో తీపి పదార్థాలు (స్వీటు కాదు) అంటే ప్రకృతిలో సహజంగా దొరికే పండ్లు శుభ్రంగా కడిగిన తర్వాత తినాలి.

క్లుప్తంగా

చెరువులో పడి మహిళ మృతి

మద్దూరు: చెరువులో చేపల కోసం వెళ్లి కాళ్లకు, చేతులకు వల చుట్టుకొని మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని చెన్వార్ చెరువులో చోటు చేసుకుంటుంది. హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ కథనం ప్రకారం.. అచ్చంపల్లికి చెందిన గూళ్ల అనంతమ్మ(35) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి పోయింది. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికారు. తరుచు ఆమె చెరువుకు చేపలు పట్టడానికి వెళ్తుండేది. ఆమె కుమారుడు క్రాంతికి అనుమానం వచ్చి బుధవారం ఉదయం చెన్వార్ శివారులోని చెరువు దగ్గరికి వెళ్లి చూడగా ఆమె మృతదేహం కనిపించింది. చేపలు పట్టడానికి వెళ్లిన ఆమెకు చెరువులో వేసిన వల కాళ్లకు, చేతులకు చుట్టుకోవడంతో నీటిలో మునిగి చనిపోయింది. ఆమె భర్త గూళ్ల కన్కప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. ఆమెకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

వాగులో పడి వ్యక్తి..

కోయిల్‌కొండ: వాగులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కోత్లాబాద్ శివారులో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. హన్వాడ మండలం దంతెనపల్లికి చెందిన మైబు(45) గత నెల 31వ తేదీన గుండుమాల్ మండలం కొమ్మురులో ఉన్న కుటుంబ సభ్యులను కలిసేందుకు కాలినడకన బయలుదేరాడు. మార్గమధ్యలో కోత్లాబాద్ శివారు వాగు నీటిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. బుధవారం అతని మృతదేహం నీటిలో తేలడంతో చుట్టు పక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పాముకాటుతో మహిళ..


నాగమ్మ(ఫైల్)

పాన్‌గల్: పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన బుధవారం బహదూర్‌గూడెంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రవిప్రకాష్ కథనం ప్రకారం.. మండలంలోని బహదూర్‌గూడెం గ్రామానికి చెందిన నాగమ్మ (57) పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆటోలో జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం ఆమె మృతదేహాన్ని జిల్లా కేంద్రం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆమె కుమారుడు ఆశన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నాగర్‌కర్నూల్ క్రైం: లాడ్జీలో పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు పట్టుకున్న ఘటన జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సిరి లాడ్జీలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పోలీసులకు సమాచారం రావడంతో లాడ్జీపై దాడి చేశారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.33,830 నగదు, 11 సెల్‌ఫోన్లు, కారు, స్కూటీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసిన వారిలో నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ కౌన్సిలర్, ఎంపీటీసీ, పోలీసు కానిస్టేబుల్, మరో 8 మంది ఉన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఒకే కుటుంబంలో ఆరుగురు అదృశ్యం


పిల్లలతో శివలీల

నవాబుపేట: పొట్టకూటి కోసం హైదరాబాద్ వెళ్లిన కుటుంబం అదృశ్యమైంది. ఈ విషయంలో అదృశ్యమైన మహిళ తండ్రి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయటంతో 15 రోజుల అనంతరం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, గ్రామస్తుల తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని రుద్రారం చెందిన మన్యం తన భార్య శివలీల, ముగ్గురు పిల్లలతో కలిసి పనికోసం హైదరాబాద్ వెళ్లారు. జూలై 17న శివలీల కనిపించటం లేదని సమీప బంధువుల ద్వారా ఆమె తండ్రి మైబు సమాచారం తెలుసుకుని హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ తన కూతురు, ఆమె ముగ్గురు పిల్లలు కూడా కనిపించలేదు. తన అల్లుడు మన్యంను ఆరా తీసేందుకు ప్రయత్నించగా అతడు కనిపంచకుండా పోయాడు. దీంతో బుధవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లో తన కూతురు, పనిచేసే చోట తన అల్లుడు మన్యం హన్వాడ మండలానికి చెందిన బాలికతో ఇంట్లో సహజీవనం చేశారని, దీంతోనే ఇద్దరి మధ్య గొడవలు జరిగి తన కూతురు అదృశ్యమై ఉంటుందని అతడు పోలీసులకు వివరించాడు. నాటి నుంచి మన్యం, అతని భార్య శివలీల, ముగ్గురు పిల్లలు, మన్యంతో తనతో తీసుకుని వచ్చిన హన్వాడకు చెందిన బాలిక మొత్తం ఆరుగురు అదృశ్యమయ్యారు. ఈ సంఘటనలో హైదరాబాద్‌తో పాటు నవాబుపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

శక్తిపీఠంపై దేవాదాయ శాఖ నిర్లక్ష్యం

- ఏటా రూ.6 కోట్ల ఆదాయం
- అవసరమైన నియామకాలకు తిలోదకాలు
- అనవసర నియామకాలకు ప్రాధాన్యత
- పూజలు లేక మూతబడిన ఆలయాలు
- అభివృద్ధిపై నాయకులకు లేని చిత్తశుద్ధి


అలంపూర్ ఆలయాల సముదాయం

జోగుళాంబ శక్తిపీఠం: తెలంగాణ రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాలకు ఏటా రూ.6కోట్ల ఆదాయం ఉన్నా, రాష్ట్ర దేవాదాయశాఖ మాత్రం ఈ ఆలయ పర్యవేక్షణ, అభివృద్ధి విషయంలో పట్టించుకోవడం లేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఏ ఆలయానికీ లేనంతగా ఏడాదికి రూ.కోటి ఆదాయం వస్తున్నా పర్యవేక్షణ చేయకపోవడం, కనీసం ఇటువైపు చూడకపోవడం గమనార్హం. ఇక ఈ ప్రాంత ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రులు, జెడ్పీ చైర్మన్, ఎంపీలు, ఆలయానికి వీఐపీలు వచ్చినప్పుడు వారితోపాటు చుట్టపుచూపుగా వస్తారు. యాదాద్రి తరహాలో అభివృద్ధి చేస్తామంటూ ఉపన్యాసాలు తప్ప, ఈ ఆలయాల అభివృద్ధిపై ఒక్క నిమిషం కూడా సమీక్ష చేసిన దాఖలాలు లేవు.

మూత పడుతున్న ఆలయాలు

ఆలయానికి నిత్యం వందలాది మంది భక్తులు వస్తుంటారు. అలంపూర్‌లో అడుగడుగునా అనేక ఆలయాలు ఉన్నాయి. కానీ అందులో పూజలు చేయడానికి సరిపడా అర్చకులను మాత్రం నియమించకుండా ఇతర సిబ్బందిని అత్యధిక సంఖ్యలో నియమించడంతో చాలా ఆలయాలు మూత పడ్డాయి. దీంతో నిత్య ధూప, దీప నైవేద్యాలకు పదుల సంఖ్యలో ఆలయాలు నోచుకోలేక పోతున్నాయి.

ఆలయాలు, ఉద్యోగుల వివరాలు ఇలా..

ప్రధాన బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో పాటు మరో 8 ఆలయాలుగా ఉన్న నవబ్రహ్మ ఆలయాలు, జోగుళాంబ ఆలయం, వెంకటేశ్వర స్వామి, కామాక్షి, సూర్యనారాయణ, యోగనారసింహ, పాపనాశేశ్వర, వీరభద్ర, పరివార దేవతా ఆలయాలు ఉన్నాయి. ఇవి కాక నవగ్రహ, వాహన పూజలు వంటి అలయాలకు అర్చకులు అవసరం. అంటే ఇంతపెద్ద ఆలయాలకు చతుర్వేద పారాయణాలకు నలుగురు వేదపండితులు, స్థానాచార్య, ప్రధాన అర్చక, ఉపప్రధాన అర్చక, ముఖ్య అర్చక, అర్చక, పరిచారక అర్చక ఇలా సుమారు కనీసం 35మంది అవసరం. కానీ ఇక్కడ మాత్రం కేవలం 12మంది రెగ్యులర్ అర్చకులు, ముగ్గురు తాత్కాలిక అర్చకులతో సరిపెట్టారు. ఇక కార్యాలయ నిర్వహణ కోసం ఒక ఈఓ, ఒక సీనియర్ అసిస్టెంట్, ఆరుగురు జూనియర్ అసిస్టెంట్‌లు, ఇద్దరు రికార్డు అసిస్టెంట్, ఒక కంప్యూటర్ ఆపరేటర్, 9మంది రెగ్యులర్ అటెండర్‌లు ఒక రెగ్యులర్ తోటమాలి, కన్సల్టేషన్‌పై మరో తోటమాలి, ఏడుగురు తాత్కాలిక అటెండర్‌లు, ఐదుగురు రెగ్యులర్ భజంత్రి, ఒకరు కన్సాల్టేటిషన్‌పై మరో భజంత్రి, ఆరుగురు ఔట్‌సోర్స్ ఉద్యోగులు, ఇవి గాక రోజువారిగా మరో 8మంది లడ్డూ తయారీ కోసం, మరో ఐదుమంది సిబ్బంది పని చేస్తున్నారు.

త్వరలోనే నియమిస్తాం..



ఇటీవల అర్చకుల నియామకం కోసం నోటిఫికేషన్ వేశాం. చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారు. సాంకేతిక లోపాలు, మరికొన్ని ఇబ్బందుల కారణంగా నియామకాలు నిలిచిపోయాయి. త్వరలోనే అర్చకులతో పాటు వేదపండితులు, ప్రధాన అర్చకులను నియమిస్తాం.

– పురేందర్‌కుమార్, ఆలయ ఈఓ

క్యాడర్ స్ట్రెంత్‌లో చిన్నచూపు..

ఆలయాల ఆదాయానికి తగ్గ, అవసరమైన నియామకాల కోసం క్యాడర్ స్ట్రెంత్‌లో కార్యాలయ అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. హైంధవ ధర్మానికి, సనాతన సాంప్రదాయ ఆచార వ్యవహారాలకు పునాదులైన స్థానాచార్య, వేదపండితులు, ప్రధాన అర్చకులు, ఉపప్రధాన అర్చకులను నియమించకుండా కేవలం ఎలక్ట్రిషన్, ప్లంబర్, సూపరింటెండెంట్ ఇలా అనేక పోస్టుల సాంక్షన్‌కు మాత్రం సిఫారసు చేస్తూ హైంధవ ధర్మానికి తిలోదకాలు వదులుతున్నారు.

ఆలయానికి ఆదాయ వనరులు ఇలా..

ఏటా వాహనాల పార్కింగ్ ద్వారా సుమారు రూ.40 లక్షలు, బుక్స్ టెండర్ ద్వారా రూ.4 లక్షలు, కొబ్బరి కాయల షాపుటెండర్ ద్వారా రూ.45 లక్షలు, చీరలవేలం టెండర్ ద్వారా.35 లక్షలు, వసతి గదులు టెండర్ ద్వారా రూ.9లక్షలు, భూముల గుత్త ద్వారా రూ.22 లక్షలు, కొబ్బరిచిప్పల వేలం రూ.5లక్షలు, టిఫిన్ సెంటర్ రూ.5 లక్షలు, హుండీల ద్వారా సుమారు రూ.2.5కోట్లు ఇలా ఏడాదికి రూ.6 కోట్లపైనే ఆదాయం వస్తోంది.

ప్రాధాన్యత గుర్తించకపోవడం బాధాకరం



ఇంత ఆదాయం ఉన్న ఆలయంలో నిత్యం వేద ఘోష వినిపించాలి. స్థానాచార్య, ప్రధాన, ఉపప్రధాన అర్చకులు ఉండాలి. ఆలయాలకు తగ్గట్టు అర్చకుల సంఖ్య పెరగాలి. కానీ పాలకులు ఈ విషయంపై పట్టించుకోవడం లేదు. కాబట్టే ఇక్కడ నిత్యం వేదఘోష జరగడం లేదు. చాలా ఆలయాల్లో దీపాలు కూడా వెలగని పరిస్థితి ఏర్పడింది. ఇది బాధాకరం.

– ఆనంద్ శర్మ, ముఖ్య అర్చకుడు

పాలిటిక్స్‌గా మార్చారు..



నామినేటెడ్ పోస్టులైన ఆలయ పాలకమండలికి పోటీ పడి క్షణాల్లో పాలకమండలి నియామకాలు జరిపే పాలకులు, ఆలయాలకు సరిపడా వేద పండితులు, స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, అర్చకులను నియమించేందుకు దృష్టి పెట్టడం లేదు. జోగుళాంబ ఆలయాన్ని ప్రస్తుత పాలకులు ఆలయాలను పాలిటిక్స్‌గా మార్చేశారు.

– రాజశేఖర్ శర్మ, హిందూ ధార్మిక సేన రాష్ట్ర అధ్యక్షుడు

జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి

- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



రెడ్ క్రాస్ చైర్మన్ నటరాజ్‌ను సన్మానిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అన్ని అంశాలలో జిల్లాను దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల జాతీయ స్థాయిలో రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబ్‌నగర్ శాఖకు గోల్డ్ మెడల్ రావడం సంతృప్తిగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఇంకా సేవలందించాలని కోరారు. దేశంలోనే పెద్దదైన 2097 ఎకరాల్లో కేసీఆర్ అర్బన్ ఏకో పార్కు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దివిటిపల్లి ఐటీ పార్కులో దేశంలోనే పెద్దదైన లిథియం సెల్ బ్యాటరీ ఫ్యాక్టరీని తీర్చిదిద్దుతామన్నారు. జెనివా రెడ్‌క్రాస్ సొసైటీలో జిల్లా పేరు వినపడేలా కృషి చేయాలన్నారు. యూత్ రెడ్‌క్రాస్‌లో బంగారు పతకాలు సాధించిన సభ్యులను అభినందించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్, ఏఎస్పీ రాములు, రెడ్ క్రాస్ చైర్మన్ నటరాజు మాట్లాడారు. వివిధ అంశాలలో గోల్డ్ మెడల్స్ సాధించిన తహసీల్దార్లు, ఇతర అధికారులు, జీవితకాల సభ్యులకు మంత్రి గోల్డ్ మెడల్స్ ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్యామ్యూల్, జగపతిరావు, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా


పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కాశన్న కుటుంబ సభ్యులు

పెద్దకొత్తపల్లి: దేదినేనిపల్లికి చెందిన కాశన్నను హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మృతదేహంతో పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ధర్నా చేశారు. నాగర్‌కర్నూల్ డీఎస్పీ మోహన్‌కుమార్ హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం మృతదేహాన్ని దేదినేనిపల్లికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ధర్నాలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అభిలాష్‌రావు, ఉపసర్పంచ్ రామకృష్ణ, మల్లేష్, శివ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

20 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

నవాబుపేట: మండలంలోని కాకర్లపహడ్‌లో జరిగిన భూ తగాదా దాడిలో 20 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. ఉదండాపూర్‌కు చెందిన రామాంజనేయులు మండలంలోని కాకర్లపహడ్ స్టేజీ వద్ద ఉన్న 8గుంటల భూమి విషయంలో గతేడాది జూన్‌లో గోడవ జరిగింది. ఈ సమయంలో తన ఇంటి ప్రహరీని సిద్దోటం గ్రామానికి చెందిన రామకృష్ణ, అంజనేయులు, నర్సింహులు, శ్రీకాంత్, రాజు, వెంకటేష్, కనకయ్య, బాల్‌రాజ్, శ్రీనివాస్, యాదయ్య, మరో 10 మంది కూలగొట్టి దౌర్జన్యం చేసి, కులం పేరుతో దూషించి, చంపేందుకు వెంటపడ్డారని బాధితుడు రామాంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పట్లో ప్రహరీ కూల్చివేత, కులం పేరుతో దూషించడంపై బాధితుడు డీజీపీకి ఫిర్యాదు చేశాడు. తాజాగా బుధవారం దాడి చేసి దౌర్జన్యంగా భూమిని అక్రమించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీఎస్పీకి ఆదేశాలు వచ్చాయి. దీంతో 20 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

విద్యుదాఘాతంతో నాలుగు గొర్రెలు మృతి



మాగనూర్: మండలంలోని ఒబ్లాపూర్ గేట్ సమీపంలో రోడ్డు పనుల డాంబర్ మిషన్ దగ్గర ఏర్పాటు చేసి విద్యుత్ బుడ్డి తీగలు గాలికి తెగిపడటంతో విద్యుదాఘాతానికి గురై గొర్రెలు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మాగనూర్‌కు చెందిన కురువ కర్రెప్ప తన గొర్రెల మందతో మేత కోసం ఒబ్లాపూర్ శివారులోకి వెళ్లాడు. రోడ్డు పక్కన మేత మేస్తూ డాంబర్ ప్లాంట్ సమీపంలోకి వెళ్లగా తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి నాలుగు గొర్రెలు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెల విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మంగదొడ్డి వేమన్న (ఫైల్)

వీపనగండ్ల: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని తూంకంటకు చెందిన రైతు గొల్లమంగదొడ్డి వేమన్న (52) తన పొలం వద్ద ఏర్పాటు చేసిన కోళ్లషెడ్డులో విద్యుద్‌ను సరిచేసేందుకు ప్రయత్నించాడు. ఈనేపథ్యంలో విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. అపస్మారకస్థితిలో ఉన్న వేమన్నను చుట్టుపక్కల రైతులు, కుటుంబసభ్యులు వెంటనే వీపనగండ్ల పీహెచ్‌సీకి తీసుకురాగా.. మండల వైద్యాధికారి వంశీకృష్ణ పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు బోరున విలపించాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై మృతుడి భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చంద్రారెడ్డి పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

బోరు మోటారు ఆన్ చేసేందుకు వెళ్లి..


లింగమయ్య(ఫైల్)

అచ్చంపేట రూరల్: తన వ్యవసాయ పొలం వద్ద బోరు మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. అచ్చంపేట ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని హాజీపూర్‌కి చెందిన లింగమయ్య(40) తనకున్న రెండున్నర ఎకరాల్లో కొంత జొన్న, వరి పంట సాగు చేస్తున్నాడు. వరి పంట కోసం నీరు పారించడానికి మంగళవారం రాత్రి బోరు మోటారును ఆన్‌చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమీప రైతులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య కాశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అచ్చంపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పరామర్శించి ఆర్థికసాయం అందించి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.


ఐదుగురిపై కేసు నమోదు

మహమ్మదాబాద్: భూవివాదంలో రెండు వర్గాలు ఘర్షణ పడగా ఐదుగురిపై బుధవారం కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. గండేడ్ మండలంలోని కప్లాపూర్ చెందిన భార్యాభర్తలు బాలమణి, బాబుగౌడ్ గతనెల 29న తమ సొంతపొలానికి ఆటోలో వరినారు తీసుకెళ్తుండగా అదే గ్రామానికి చెందిన గోపాల్‌గౌడ్, రాధిక, అరుణ, శ్రీనివాసులు, చంద్రయ్య భూమి పంచాయితీ పెట్టి మాట్లాడేవరకు నాటు వేయకూడదని ఘర్షణ పడ్డారు. ఈ మేరకు భార్యాభర్తలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నల్లబెల్లం పట్టివేత

అచ్చంపేట రూరల్: అక్రమంగా తరలిస్తున్న నిషేధిత నల్లబెల్లాన్ని పట్టుకొని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న ఘటన నడింపల్లి స్టేజీ వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లికి చెందిన నర్సింహ, బల్మూర్ మండలం బాణాలకు చెందిన తిర్పతి నర్సింహ ఇద్దరు ఆటోలో నల్లబెల్లాన్ని డిండి నుంచి అచ్చంపేటకు తీసుకొస్తున్నారు. నడింపల్లి స్టేజీ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోను ఆపి పరిశీలించారు. ఆటోలో 15 సంచుల నల్లబెల్లం, ఒక సంచి పటికను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని, ఆటోను అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జూరాలలో 10 గేట్ల ఎత్తివేత


జూరాల ప్రాజెక్టు వద్ద 10 గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం ప్రాజెక్టుకు 37వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, బుధవారం ఉదయం 6 గంటలకు 44వేల క్యూసెక్కులకు పెరిగింది. 9 గంటలకు క్రమంగా పెరిగి 70వేల క్యూసెక్కులకు చేరింది. దీంతో 10 క్రస్టు గేట్లను ఎత్తి 39,300 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రం 3గంటలకు 75వేలు, రాత్రి 8గంటల వరకు 80వేల క్యూసెక్కులు పెరిగింది. ఆవిరి రూపంలో 88, నెట్టెంపాడు రెండు పంపుల ద్వారా 1,500, భీమా లిఫ్టు-1కు 650, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వ ద్వారా 730, సమాంతర కాల్వకు 700, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు దిగువన విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.645 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద కొనసాగుతుంది. ఆల్మట్టి ప్రాజెక్టుకు ప్రస్తుతం 1,04,111 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 60వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా, 111.806 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 30.04 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 60వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 55వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రామన్‌పాడు జలాశయంలో..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 441, సమాంతర కాల్వ ద్వారా 731 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1000, కుడి కాల్వ ద్వారా 10, ఎడమ కాల్వ ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్-2 ద్వారా 859 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనిల్ రెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి వేగవంతంగా చేపడుతున్నారు. బుధవారం 12 యూనిట్ల ద్వారా 472 మెగావాట్లు ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువ కర్ణాటక రాష్ట్రంలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల నుంచి వరదనీరు చేరుతుండడంతో ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, 30.908 ఎం.యూ., దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగా వాట్లు, 30.277 ఎం.యూ. విద్యుదుత్పత్తిని చేపట్టారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 61.185 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించామని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో వరద నీరు చేరుతున్న సందర్భంగా 39వేల క్యూసెక్కులను వినియోగిస్తున్నట్లు తెలిపారు.

శ్రీశైలానికి నీటిప్రవాహం

దోమలపెంట: శ్రీశైలానికి బుధవారం నీటి ప్రవాహం ఏర్పడింది. జూరాల నుంచి 39,300, విద్యుదుత్పత్తి చేస్తూ 38,621, సుంకేసుల నుంచి 886 క్యూసెక్కులు మొత్తం 78,807 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. 24గంటల వ్యవధిలో టీఎస్ జెన్‌కో పరిధిలోని భూగర్భ కేంద్రంలో 0.247 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 417 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేశారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 854.1 అడుగుల నీటిమట్టం, 89.5 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

బస్టాండ్ ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న వారిపై ఫిర్యాదు

మహమ్మదాబాద్: మండల పరిధిలోని నంచర్లగేట్ వద్ద ఆర్టీసీ బస్టాండ్‌కు ప్రహరీ నిర్మించేందుకు సంబంధిత అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అందుకోసం సర్వే చేసి హద్దులు నిర్ణయించడంతో గతంలో భూదానం ఇచ్చిన రైతులు అడ్డుతగిలారు. దీంతో బుధవారం పరిగి డిపో మేనేజరు పవిత్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా గతంలో ఆర్టీసీ డిపోకు 1.18 ఎకరాలస్థలాన్ని ఇవ్వగా ప్రస్తుతం ధరలు విపరీతంగా పెరిగి నష్టపోయినా తమకు ఆర్టీసీ నుంచి ఎలాంటి లాభం లేకపోయిందని రైతులు తెలిపారు. తమ కుటుంబంలో ఇద్దరికి ఆర్టీసీలో ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా గతంలో ఇచ్చిన 1.18 ఎకరాల భూమికంటే కొంత ఎక్కువగా ఉన్నదని, దానిని తమకు వదలాలని పేర్కొన్నారు. ఎంతో విలువైన భూములను ఇచ్చి తమ కుటుంబాలు రోడ్డుపాలు అవుతున్నందున ఆర్టీసీ ఉద్యోగాలు కల్పించాలని అన్నారు. కాగా ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు నిర్ణయం తీసుకోనున్నట్లు డిపో మేనేజరు తెలిపారు.

క్లుప్తంగా...

చెరువుల నుంచి మట్టి తవ్వకం అక్రమమే

ఉద్దండాపూర్‌పై పిటిషన్‌లో ఎన్జీటీ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉద్దండాపూర్ రిజర్వాయర్ కట్ట నిర్మాణం కోసం చెరువుల్లోని మట్టిని పెద్దఎత్తున తవ్వి తరలించడం అక్రమేనని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) తేల్చింది. అది పర్యావరణ చట్టాలకు విరుద్ధమని పేర్కొంది. తవ్విన మట్టిని అంచనా వేసి జరిమానాను లెక్కించాలని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ను ఆదేశించింది. ఈ జరిమానాను కృష్ణా నదీ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ)కి చెల్లించాల్సి ఉంటుందని చెప్పింది. దీని కోసం 4 వారాలు గడువిస్తున్నట్లు పేర్కొంది. పాలమూరు, రంగారెడ్డి లిఫ్ట్ స్కీమ్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్ జిల్లాలో ఉద్దండాపూర్ రిజర్వాయర్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అయితే అత్యంత పొడవైన ఈ రిజర్వాయర్ నిర్మాణానికి పర్యావరణ అనుమతి లేకున్నా చుట్టు పక్కల ఉన్న చెరువుల నుంచి విచక్షణా రహితంగా మట్టిని తవ్వి కట్ట నిర్మాణానికి తరలిస్తున్నారు. ఇది చట్టవిరుద్ధమని పేర్కొంటూ మహబూబ్‌నగర్ జిల్లా ముదిరెడ్డిపల్లెకు చెందిన కోస్గీ వెంకటయ్య ఎన్జీటీలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జ్యుడీషియల్ సభ్యులు జస్టిస్ పుష్ప సత్యనారాయణ, ఎక్స్‌పర్ట్ సభ్యులు సత్యగోపాల్ కొర్లపాటి బెంచ్ విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు. 'మట్టిని విచక్షణారహితంగా తవ్వితే చెరువుల నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతింటుంది. భూగర్భ జలాలు ప్రతికూలంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. వర్షపు నీరు పూర్తిగా ఖాళీ అయిన తర్వాత భూగర్భ జలాలు మరింత కిందకు పడిపోతాయి. ఆ మట్టిని అనుమతి లేకుండా కట్ట నిర్మాణానికి ఉపయోగించడం చట్టవిరుద్ధం. వెంటనే తవ్వకాలను ఆపేలా ఆదేశాలు ఇవ్వాలి' అని వాదించారు. వాదనలు పూర్తి కావడంతో జస్టిస్ పుష్ప తీర్పు వెల్లడించారు.

ఏపీ బీసీ యూత్ అసోసియేషన్ కార్యదర్శిగా శివకుమార్

లక్డీకాపూల్ (హైదరాబాద్): తిరుపతి జిల్లా రేణిగుంటకు చెందిన పి.శివకుమార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ యూత్ అసోసియేషన్ కార్యదర్శిగా నియమితులయ్యారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు ఈ నియామకాన్ని చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ (నాని ముదిరాజ్) తెలిపారు.

మేం చెప్పిందే చట్టం!

ప్రభుత్వం తమదంటూ అధికారులను బెదిరించిన 'నారాయణ'

- బినామీలు, బంధువుల పేరిట భారీగా అసైన్డ్ భూములు కాజేశారు
- బినామీల పేరిట కొన్న 148 ఎకరాల ప్రస్తుత మార్కెట్ విలువ రూ.600 కోట్లకుపైనే
- నారాయణ, ఆయన కుమార్తె ఫోన్ సంభాషణల్లో ఈ వ్యవహారం బయటపడింది
- చంద్రబాబుకు సైతం భాగస్వామ్యం.. ఆధారాలున్నాయి.. లోతైన దర్యాప్తు అవసరం
- స్టే ఎత్తివేసి దర్యాప్తునకు అనుమతివ్వండి.. హైకోర్టుకు నివేదించిన ఏఏజీ పొన్నవోలు

సాక్షి, అమరావతి: ఏపీ రాజధాని అమరావతిలో నిరుపేద అసైన్డ్‌దారులను బెదిరించి బినామీలు, బంధువుల పేరిట కారుచౌకగా భూములను కొట్టేసిన మాజీ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను సైతం బెదిరించారని సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్ రెడ్డి హైకోర్టుకు బుధవారం నివేదించారు. ప్రభుత్వం తమదని, తాము చెప్పిందే చట్టమని, చెప్పినట్లు చేయాలంటూ అధికారులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అప్పటి అడ్వొకేట్ జనరల్ (ఏజీ), న్యాయశాఖ, ముఖ్య కార్యదర్శులు, ఐఏఎస్ అధికారులు వారించినా నారాయణ లెక్క చేయలేదని తెలిపారు. అసైన్డ్ భూముల కొనుగోళ్ల వ్యవహారంలో నారాయణే కీలక సూత్రధారి అని స్పష్టం చేశారు. ఆయన సమీప బంధువులు, బినామీల పేరిట 148 ఎకరాలను కొనుగోలు చేసేందుకు రూ.18.10 కోట్లు వెచ్చించినట్లు నివేదించారు. ప్రస్తుతం వాటి మార్కెట్ విలువ రూ.600 కోట్లకు పైనే ఉంటుందని కోర్టు దృష్టికి తెచ్చారు. అసైన్డ్ భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందని, అంతిమంగా పేదలకు ఎలాంటి లబ్ధి చేకూరదంటూ గత ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నేతలు భయాందోళనలు రేకెత్తించారన్నారు. అనంతరం అసైన్డ్‌దారుల నుంచి భూములను అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ల ద్వారా నామమాత్రపు ధరలకు కొట్టేశారని వివరించారు. ఆ తరువాత వాటిని ల్యాండ్ పూలింగ్ స్కీం కింద సీఆర్‌డీఏకు ఇచ్చి జీవో 41 (ల్యాండ్ పూలింగ్ స్కీం రూల్స్)ని అడ్డం పెట్టుకుని విలువైన నివాస, వాణిజ్య ప్లాట్లను పొందినట్లు తెలిపారు. కొన్నిటిని అధిక ధరలకు అమ్ము



కున్నట్లు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ మొత్తం నేరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నాటి పురపాలక శాఖ మంత్రి నారాయణ పాత్రపై స్పష్టమైన ఆధారాలున్నాయని నివేదించారు. దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్న నారాయణ ఫోన్‌లో ఆయన కుమార్తె సింధూరతో జరిపిన కీలక సంభాషణలున్నట్లు తెలిపారు. తాను అసైన్డ్ భూములను కొన్నట్లు ఆ సంభాషణల్లో నారాయణ అంగీకరించారని వెల్లడించారు. అసైన్డ్ భూములు తమ పేర్లతో ఉంటే ప్రభుత్వం జైల్లో వేస్తుందని నారాయణ తన కుమార్తెతో చెప్పారన్నారు. ఆ సంభాషణల తాలుకూ పెన్ డ్రైవ్‌ను సీల్డ్ కవర్‌లో కోర్టుకు అందచేశారు. ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి ఒరిజినల్ రికార్డులను సైతం సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించారు. సుధాకర్‌రెడ్డి వాదనలు పూర్తి కాకపోవడంతో తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. అసైన్డ్ భూముల బదలాయింపులో అక్రమాలపై మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు ఆధారంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ మంత్రి పొంగూరు నారాయణలపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీన్ని కొట్టివేయాలని కోరుతూ వేర్వేరుగా దాఖలైన క్వాష్ పిటిషన్లపై స్టే విధించిన న్యాయస్థానం ఇటీవల తుది విచారణ చేపట్టింది.

ఇతర టీడీపీ నేతలు కూడా..

అసైన్డ్‌దారులను బెదిరించి కేవలం నారాయణ మాత్రమే కాకుండా అప్పటి అధికార పార్టీ నేతలైన రావెల కిషోర్‌బాబు, అనగాని సత్యప్రసాద్, పరిటాల శ్రీరామ్, ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు కూడా భూములను సొంతం చేసుకున్నట్లు ఏఏజీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి అసైన్డ్ భూములను తీసుకురావడం, ఆ భూముల బదలాయింపుపై అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్ కాంతీలాల్ దండే, జాయింట్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అభ్యంతరం తెలిపారన్నారు. ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ సైతం అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. అసైన్డ్ భూముల విషయంలో చట్టపరమైన నిబంధనలను నారాయణకు స్పష్టంగా వివరించినట్లు వారు తమ వాంగ్మూలాల్లో స్పష్టంగా చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో స్టే ఎత్తివేసి సీఐడీ దర్యాప్తు కొనసాగించేందుకు అనుమతి నివ్వాలని అభ్యర్థించారు.

చట్టపరమైన రక్షణ ఉంది.. ప్రాసిక్యూషన్ తగదు

అంతకు ముందు నారాయణ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ సీఆర్‌డీఏ చట్టం కింద తీసుకున్న నిర్ణయాల విషయంలో ప్రభుత్వం, అధికారులు, అథారిటీలకు వ్యతిరేకంగా ఎలాంటి కేసులు దాఖలు చేయడానికి వీల్లేదన్నారు. చట్టం కింద రక్షణ ఉన్నందున నారాయణను ప్రాసిక్యూట్ చేయడానికి వీల్లేదన్నారు. తమకున్న అధికారం మేరకే జీవో 41 జారీ చేశారని తెలిపారు. ఈ అధికారాన్ని ప్రశ్నించడానికి వీల్లేదన్నారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకునే వారికి దురుద్దేశాలు అంటగట్టడానికి వీల్లేదన్నారు. అసైన్డ్ భూముల విషయంలో ఎస్సీ, ఎస్టీలెవరూ ఫిర్యాదుదారులు కాదన్నారు. అందువల్ల ఆ చట్టం కింద కేసు నమోదు చేయడానికి వీల్లేదన్నారు.

భారీ స్కామ్.. 'బ్రో'

- అమెరికాలో బాబు ముఠా వసూలు చేసిన డబ్బునే పవన్‌కు ప్యాకేజీగా ఇప్పించారు: అంబటి
- చాలా ముఖ్యమైన అంశంపై ఢిల్లీ వెళ్తున్నట్లు అంబటి వెల్లడి

సాక్షి, అమరావతి: బ్రో సినిమా వ్యవహారంలో నూటికి నూరు శాతం అక్రమ ఆర్థిక లావాదేవీలు జరిగాయని, అదో కుంభకోణమని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పునరుద్ఘాటించారు. తన ఆరోపణల్లో వాస్తవాలు లేకపోతే సినిమా నిర్మాతగానీ పవన్ కల్యాణ్‌గానీ ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. వాస్తవాలు వెల్లడించేందుకు భయపడుతున్నారా? దాస్తున్నా రా? అని నిలదీశారు. దాస్తున్నారంటే అందులో స్కామ్ దాగి ఉందనే అర్థమని స్పష్టం చేశారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి అంబటి బుధవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అమెరికాలో తన ముఠా ద్వారా వసూలు చేసిన డబ్బును నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ద్వారా పవన్‌కు ప్యాకేజీగా ఇప్పించారని పునరుద్ఘాటించారు.

డైలాగ్‌లు కొట్టి దాగుడు మూతలెందుకు?

బ్రో సినిమాకు విదేశీ పెట్టుబడులు అక్రమంగా వచ్చాయని, ఇది మనీలాండరింగ్ కాదా? అని అంబటి సూటిగా ప్రశ్నించారు. ఈ సినిమాకు పెట్టిన పెట్టుబడి ఎంత? కలెక్షన్లు ఎంత? పవన్



పారితోషికం ఎంత? ఆదాయ పన్నుగా కట్టింది ఎంత? అని ప్రశ్నించారు. అత్యంత నిజాయితీపరుడినని, అపర దాన కర్ణుడినని, సమాజ శ్రేయస్సు కోరుకునే వ్యక్తినంటూ డైలాగ్‌లు కొట్టే పవన్ వాస్తవాలను ఎందుకు దాస్తున్నారని నిలదీశారు. సినిమాను సినిమాలాగే చూడాలన్న సాయి ధరమ్ తేజ్ వ్యాఖ్యలపై మంత్రి అంబటి స్పందిస్తూ అలాంటప్పుడు సినిమాలను సినిమాగానే తీయండి...మధ్యలో మమ్మల్ని గోకడమెందుకు? అని చురకలంటించారు. బ్రో సినిమా వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగిందంటూ ఈడీ, సీబీఐకి ఫిర్యాదు చేసేందుకు ఢిల్లీ వెళ్తున్నారా? అని విలేకరులు ప్రశ్నించగా 'నేను ఇవాళ రాత్రి చాలా ముఖ్యమైన అంశంపై ఢిల్లీ వెళ్తున్నా. మా పార్టీ ఎంపీలను కలుస్తా. ఢిల్లీ నుంచి వచ్చాక అన్ని వివరాలు చెబుతా' అని అంబటి చెప్పారు.

వృద్ధాప్యంలోనూ అనుమానంతో వేధిస్తున్నాడని..

- భర్త హత్యకు భార్య సుపారీ
- రూ. రెండు లక్షలు తీసుకొని హతమార్చిన ఇద్దరు
- ఆలస్యంగా ఘటన వెలుగులోకి...



మృతదేహాన్ని వెలికితీస్తున్న అధికారులు. ఇన్‌సెట్లో కాశయ్య (ఫైల్)

సిరిసిల్లక్రైం: వృద్ధాప్యంలోనూ కట్టుకున్న భార్యను అనుమానించాడు. భర్త పదేపదే కొట్టడంతో విసిగిపోయింది. ఎలాగైనా తన భర్తను హతమార్చాలని రూ.రెండు లక్షలకు సుపారీ ఇచ్చింది. గత నెల 13వ తేదీన హత్య జరగ్గా, బుధవారం ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సిద్దిపేట జిల్లా చింతమడక గ్రామానికి చెందిన కనకవ్వ(60), కాశయ్య(65) బతుకుదెరువుకు సిరిసిల్లకు 25 ఏళ్ల క్రితం వచ్చారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. కూతుళ్లకు పెళ్లిళ్లు జరగగా, కొడుకు మానసిక స్థితి సరిగ్గా లేదు. వృద్ధ దంపతులిద్దరూ సిరిసిల్ల మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తారు. ఈ క్రమంలోనే భార్యపై భర్తకు అనుమానం కలిగింది. పలుమార్లు కనకవ్వను కొట్టాడు. ఆమె భర్త వేధింపులు తట్టుకోలేకపోయింది. వరుసకు తమ్మునిగా పిలిచే ఒకరికి విషయాన్ని చెప్పింది. భర్తను చంపితే రూ.2లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకుంది. గత నెల 13న మద్యం మత్తులో కాశయ్య నిద్రిస్తుండగా, అనుకున్న పథకం ప్రకారం తను సంప్రదించిన వారికి సమాచారం ఇచ్చింది. వారు ఇంటికి చేరుకొని నిద్రలో ఉన్న కాశయ్య గొంతుకు దుప్పటి చుట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపేశారు. మృతదేహాన్ని కారులో వేసుకొని సిరిసిల్లలోని మానేరు వాగు చెక్‌డ్యామ్ వద్ద బొందలగడ్డలో పూడ్చిపెట్టారు. ఆ తర్వాత రూ.2 లక్షలు తీసుకుని వెళ్లిపోయారు.

డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్

చంపడానికి చేసుకున్న ఒప్పందంతోపాటు హత్య చేసిన విధానాన్ని నిందితుల్లో ఒకరు వీడియో తీసినట్లు తెలిసింది. హత్య చేసిన తర్వాత వచ్చిన రూ.2లక్షలతో జల్సాలు చేసే సమయంలో మరో రూ.లక్ష కావాలంటూ కనకవ్వను డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకుంటే హత్యకు సంబంధించిన వీడియో బయటపెడతామని బెదిరించసాగారు. ఈ తతంగమంతా బయటకు పొక్కింది. దీనిపై సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్ విచారణ చేపట్టారు. కూరగాయల మార్కెట్ ఏరియాలో నిఘా పెట్టి అనుమానితుల నుంచి సమాచారం సేకరించారు. చివరికి వృద్ధుడి హత్య చేయడానికి సుపారీ తీసుకున్న ఇద్దరు నిందితులతోపాటు మృతుని భార్యను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగుచూసింది. బొందలగడ్డలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని తహసీల్దార్ సమక్షంలో బయటకు తీయించారు. ఈ విషయంపై సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్‌ను వివరణ కోరగా కేసు దర్యాప్తులో ఉందని, వివరాలు ఉన్నతాధికారుల సమక్షంలో వెల్లడిస్తామని తెలిపారు.

82.92 లక్షల ఎకరాల్లో పంటల సాగు

అందులో 43.25 లక్షల ఎకరాల్లో పత్తి

- 25.52 లక్షల ఎకరాల్లో వరి నాట్లు
- ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంటల సాగు ఊపందుకుంది. భారీ వర్షాలు కురవడంతో ఒకవైపు పంట నష్టం జరిగినా, మరోవైపు రైతులు వరి నాట్లు వేసుకోవడంలో నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లో 82.92 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో వెల్లడించింది. ఈ సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం 1.24 కోట్ల ఎకరాలు కాగా, 66.72% విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50.59 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 43.25 లక్షల ఎకరాల్లో సాగైంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 49.86 లక్షల ఎకరాలు ఉండగా ఇప్పటివరకు 25.52 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 9.43 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.80 లక్షల ఎకరాల్లో, సోయాబీన్ సాధారణ సాగు విస్తీర్ణం 4.13 లక్షల ఎకరాలు ఉండగా ఇప్పటివరకు 4.26 లక్షల ఎకరాల్లో సాగైంది. ఇక మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 7.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.51 లక్షల ఎకరాల్లో సాగైంది.

నాటి శంఖంమద్దే.. నేటి సంకలమద్ది

- పురావస్తుశాఖ పరిశోధకుడు శివనాగిరెడ్డి



అడ్డాకుల: ప్రస్తుతం సంకలమద్దిగా పిలిచే గ్రామాన్ని పూర్వ కాలంలో శంఖంమద్దిగా పిలిచేవారని పురావస్తుశాఖ పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. మూసాపేట మండలం కేంద్రంలోని అయ్యప్పగుట్టపై నిర్మించిన సంకల్పసిద్ధి హరిహర అయ్యప్ప క్షేత్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూర్వం రహదారిపై వెళ్లే వారికి సమయాన్ని తెలిపే విధంగా మద్ది చెట్టు పైనుంచి సమయాన్ని సూచిస్తూ శంఖం ఊదించే వారని చెప్పారు. శంఖంమద్దిగా పిలిచే నాటి గ్రామాన్ని క్రమేపీ కోరిన కోర్కెలు తీర్చే సంకల్పసిద్ధిగా ప్రస్తుతం సంకలమద్దిగా పిలుస్తున్నారని తెలిపారు. రామస్వామి గుట్టపై నిర్మించిన పురాతన రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని ఈనెల 5న సందర్శించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ శెట్టి శేఖర్, ఆలయ నిర్వాహకులు మిడ్జిల్ విశ్వేశ్వర్‌నాథ్, యాదయ్యశెట్టి, కొంగరి శ్రీను, జంగం మధు, టీచర్ నారాయణ, కృష్ణయ్య ఉన్నారు.

పాలమూరులో 'ఈషా' గ్రామోత్సవం

- ఈ నెల 5, 6 తేదీల్లో క్రీడాపోటీలు
- మెయిన్ స్టేడియంలో నిర్వహణ



మెయిన్ స్టేడియంలో వాలీబాల్ కోర్టు ను పరిశీలిస్తున్న వలంటీర్లు, డీవైఎస్‌ఓ శ్రీనివాసులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 15వ ఈషా గ్రామోత్సవం నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడల ప్రోత్సాహం కోసం తొలిసారిగా రాష్ట్రంలో ఈషా గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. ఈనెల 5, 6 తేదీల్లో మహబూబ్‌నగర్, సంగారెడ్డి, సిద్దిపేట, జనగాం జిల్లాల్లో, 26, 27 తేదీల్లో కరీంనగర్, వరంగల్, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, సిరిసిల్ల జిల్లాలో క్రీడాపోటీలు నిర్వహించనున్నారు.

5, 6 తేదీల్లో జిల్లాస్థాయి క్రీడాపోటీలు..

జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 5, 6 తేదీల్లో జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫౌండేషన్ వలంటీర్లు కొన్ని రోజుల నుంచి ఏర్పాట్లు చేస్తున్నారు. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14ఏళ్ల పైబడి పురుషులు వాలీబాల్, 13 ఏళ్ల నుంచి 21 ఏళ్లలోపు మహిళలు కేవలం ముగ్గురు, 21 ఏళ్లపైబడిన మిగతా మహిళలు త్రోబాల్ పోటీల్లో పాల్గొనడానికి అర్హులు.

నగదు బహుమతులు, సర్టిఫికెట్లు..

జిల్లాస్థాయిలో నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయనున్నారు. వాలీబాల్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.9వేలు, ద్వితీయ రూ.6వేలు, తృతీయ రూ.3వేలు, నాలుగో స్థానం జట్టుకు రూ.2వేలు, త్రోబాల్‌లో ప్రథమ స్థానం జట్టుకు రూ.5వేలు, ద్వితీయ రూ.3వేలు, తృతీయ రూ.2వేలు, నాలుగో స్థానం జట్టుకు రూ.1,500 ఇవ్వనున్నారు. అదేవిధంగా జిల్లాస్థాయిలో విన్నర్, రన్నర్ జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయి. రాష్ట్రస్థాయిలో గెలుపొందే జట్లు కోయంబత్తూర్‌లో నిర్వహించే సౌత్‌ఇండియా పోటీల్లో పాల్గొంటాయి.

ప్రారంభోత్సవంలో మంత్రి, ఎంపీ, సెలబ్రెటీలు..

ఈషా గ్రామోత్సవం జిల్లా స్థాయి క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, సినీ గాయకుడు రామ్ మిర్యాల, నటుడు కిరణ్ అబ్బవరం ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఆసక్తిగల జట్లు జ్జి ఇ//ఐటజ్ఛి.ఛౌ/జట్రుర్ఘౌట్చ్రుర్ఠు వెబ్‌సైట్‌లో ఈనెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. వివరాల కోసం 9490415087, 9347697882 నంబర్లను సంప్రదించాలి.

ఏర్పాట్ల పరిశీలన..

మెయిన్ స్టేడియంలో పోటీల ఏర్పాట్లను బుధవారం ఈషా గ్రామోత్సవం ప్రతినిధి దక్షారి, డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్, వలంటీర్లు భార్గవ్, గిరిధర్‌రెడ్డి, బస్వంత్‌రెడ్డి పరిశీలించారు. వలంటీర్లు మాట్లాడుతూ గ్రామీణ భారతదేశ స్ఫూర్తిని పునరుజ్జీవింపజేయడం గ్రామోత్సవం లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరిని ఆటల్లో ప్రోత్సహించడానికి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీవైఎస్‌ఓ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం క్రీడాపోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. క్రీడాపోటీల విజయవంతం కోసం తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

విజయవంతంగా నిర్వహిస్తాం..

జిల్లాలో ఈషా గ్రామోత్సవం క్రీడాపోటీలను విజయవంతంగా నిర్వహిస్తాం. తొలిసారిగా తెలంగాణలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నాం. గ్రామీణ స్ఫూర్తి తీసుకురావడం, ఫిట్‌నెస్ పెంపుదల కోసం ఒక అద్భుతమైన కార్యక్రమంగా ఈ క్రీడా పోటీలు నిర్వహించనున్నాం. పోటీల నిర్వహణ కోసం జిల్లా యువజన, క్రీడాశాఖ సహకారం ఎంతగానో ఉంది. ఫౌండేషన్ వలంటీర్లు నెల రోజుల నుంచి జిల్లాలోని గ్రామాల్లో పర్యటిస్తూ గ్రామోత్సవం గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

– దక్షారి, ఈషా గ్రామోత్సవం రాష్ట్ర ప్రతినిధి

14 నుంచి విశ్వశాంతి మహాయాగం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: ఈ నెల 14 నుంచి 27వ తేదీ వరకు మున్సిపాలిటీ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సమీపంలో శ్రీకృష్ణ కాలచక్రం ఆధ్వర్యంలో 80వ విశ్వశాంతి మహాయాగం కరపత్రాలను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బుధవారం ఆవిష్కరించారు. అయుత చండి అతిరుద్రం పేరుతో నిర్వహించే ఉత్సవాలను శ్రీకృష్ణ కాలచక్రం పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానందస్వామిజీ వెల్లడించారు. ప్రారంభం రోజు గణపతి పూజ, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, ధ్వజారోహణం ఉంటుందన్నారు. 15న మహాగణపతి, లక్ష్మీగణపతి, చండి, లక్ష్మీహోమాలు, సాయంత్రం లక్షగరికార్చన ఉంటుందన్నారు. ప్రతి రోజూ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న చివరి రోజు మహాపూర్ణాహుతి, గురుపూజ, శ్రీకృష్ణ ఉట్టి, శ్రీకృష్ణశాంతి కళ్యాణ మహోత్సవంతో ముగుస్తాయన్నారు. కార్యక్రమానికి భక్తులు హాజరు కావాలని ఆయన కోరారు. ఉత్సవ నిర్వహణకు సంబంధించి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, వార్డు కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్యానెల్ బోర్డులో 11కేవీ చార్జింగ్ ప్రారంభం




బోర్డుకు పూజలు చేస్తున్న ప్రాజెక్టుల ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు సమీపంలో ఉన్న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ప్యాకేజీ వన్ వద్ద ప్యానెల్ బోర్డులో 11కేవీకి చార్జింగ్‌ను తెలంగాణ ప్రాజెక్టుల ప్రభుత్వ సలహాదారులు పెంటారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పది రోజుల క్రితం ప్యానెల్ బోర్డుకు విద్యుత్ చార్జింగ్ ఇచ్చి బుధవారం ప్రారంభించడంతో విద్యుత్ పనులు పూర్తయ్యాయన్నారు. ఇంకా మోటార్లకు కరెంట్ సరఫరా చేసుకోవచ్చన్నారు. త్వరలో చేపట్టే డ్రై రన్‌కు కరెంట్ సమస్య ఉండదని తెలిపారు. గతంలో అనుకున్నట్లుగా ఆగస్టు 15 నాటికి పనులు పూర్తి చేసి ఒక పంపు ద్వారా మంచి నీటి అవసరాలకు నార్లాపూర్ రిజర్వాయర్‌కు నీటిని సరఫరాకు కృషి చేస్తామన్నారు. అంతకుముందు అధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈ అమర్‌సింగ్ ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఒకే గది.. ఏడు తరగతులు




వరండాలో కొనసాగుతున్న నాలుగు తరగతులు



గదిలో కొనసాగుతున్న మూడు తరగతులు

లింగాల: ఒక్కగదిలోనే ఏడు తరగతులకు బోధన చేయాల్సి దుస్థితి మండలంలోని దారారం ప్రాథమికోన్నత పాఠశాలలో నెలకొంది. 100మంది విద్యార్థులుండగా, ఏడుగురు ఉపాధ్యాయులున్నారు. ఇద్దరు డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలల్లో పని చేస్తున్నారు. పాత గదుల శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో గదుల్లేక కార్యాలయంపై ఉన్న ఒక్కగదినే బోధనకు వాడుతున్నారు. వరండాలో 1 నుంచి 4 తరగతులు, గదిలో 5 నుంచి 7తరగతులకు బోధిస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గదిలో ఒకరు, వరండాలో మరొకరు బోధన చేస్తే మిగతా ముగ్గురు ఉపాధ్యాయులు కాలక్షేపం చేయాల్సి వస్తోంది. ఈ విషయంపై కాంప్లెక్స్ హెచ్‌ఎం శేఖర్ వివరణ కోరగా.. గదుల కొరత విషయాన్ని ఎంఈఓ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. 'మన ఊరు–మన బడి' రెండో దశలో పాఠశాల ఎంపికైతే గదుల నిర్మాణానికి నిధులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

భూమిని కాపాడుకోవడం అందరి బాధ్యత



గ్రామస్తులతో మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం నాయకులు

చిన్నంబావి: మండలంలో 116 ఎకరాల పెద్దనట్టు భూమిని కాపాడుకోవడం రైతులతో పాటు గ్రామస్తులందరి బాధ్యత అని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. మండలంలోని కొప్పునూరులో నెలకొన్న పెద్దనట్టు భూమి వివాదంపై పౌరహక్కుల సంఘం నేతలు బుధవారం గ్రామాన్ని సందర్శించి రైతులతో సమావేశమయ్యారు. 1930 నుంచి గ్రామ రైతులు, ప్రజలు అప్పట్లోనే పశువులు, గొర్రెలను మేపేందుకు 116 ఎకరాల భూమిని గ్రామ రైతు కమిటీ కొనుగోలు చేసింది. భూమిని గ్రామానికి చెందిన దామర్ల నగేష్ కుటుంబ సభ్యులు కొంత మంది అధికారుల అండదండలతో పట్టా మార్పిడి చేసి వివాదాలను సృష్టిస్తున్నారని గ్రామస్తుల పౌరహక్కుల సంఘం నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. అమాయక గ్రామ ప్రజలను రైతులను అనేక కేసులలో ఇరికించారని తెలిపారు. ఈ సందదర్భంగా రాష్ట్ర పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ ఇంత పెద్ద ఆస్తిని కాపాడుకోవడం గ్రామప్రజలు, రైతుల అందరి బాధ్యత అని దీని వెనక పెద్ద స్థాయి అధికారుల హస్తం ఉన్నట్లు తమకు అనిపిస్తుందని తెలిపారు. కోర్టులో తగిన పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు అధైర్యపడవద్దని న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నారాయణరావు, ప్రొఫెసర్ బాలయ్య, జెడ్పీటీసీ వెంకటరమణమ్మ, సర్పంచ్ నంది కొసల్య, ఎంపీటీసీ తగరం లక్ష్మి, ఉపసర్పంచ ఆనంద్ యాదవ్, డేగ శేఖర్, చిన్నారెడ్డి, బీచుపల్లి యాదవ్, నంది రాజేశ్వర్‌రెడ్డి, వడ్డేమాన్ బిచ్చన్న తదితరులు పాల్గొన్నారు.